ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగష్టు 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





ఆయువు తీసిన అప్పులు

రుణాలు తీర్చలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దదోర్నాల మండలం రామచంద్రకోటలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మాలపాటి భాస్కరరెడ్డి(46)కి 5.60 ఎకరాల సాగు భూమి ఉంది. అందులో వ్యవసాయ బోర్లు నిర్మించుకున్నాడు. ఏటా మిరప సాగు ప్రధానంగా ఉండేది. దాంతో పాటు కొంత భూమిలో పత్తి పంటను సాగు చేస్తుంటాడు. వర్షాభావం వెన్నాడటంతో భూగర్భ జలమట్టం అందనంత లోతుకు చేరుకుంది. చాలీచాలని సాగునీటితో ఆశించిన మేర దిగుబడులు రాలేదు. పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి



భాస్కరరెడ్డి (ఫైల్)

లేదు. వరసగా ఇదే తంతుగా జరుగుతోంది. ఈ క్రమంలో ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పు రూ.10 లక్షలు దాటింది. బ్యాంకుల్లోనూ అప్పు ఉంది. మొత్తం రూ.15 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ ఏడాది కాలం కలిసి వస్తే కొంతైనా తీర్చగలననే ధైర్యంతో ఉన్నాడు. వాన జాడ లేక బోర్లలో చుక్క నీరు లభ్యం కావడం లేదు. ప్రస్తుతం మిరప నాటేందుకు పొలాన్ని సిద్ధం చేశాడు. చేసిన అప్పు తీర్చలేకపోవడంతో తిరిగి పెట్టుబడులకు ఎవ్వరూ పైసా ఇవ్వలేదు. దీంతో భాస్కరరెడ్డి మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఉదయం తన పొలంలో పురుగు మందు తాగాడు. వెంటనే స్థానికులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భాస్కరరెడ్డికి భార్య వెంకటక్ష్మి, కుమార్తె పుష్పలత, కుమారుడు అశోక్‌రెడ్డి ఉన్నాడు. కుమార్తెకు వివాహం చేశాడు. కుమారుడు డిగ్రీ పూర్తి చేశాడు.

నీటి సరఫరా బిల్లులకు గ్రీన్‌సిగ్నల్

- బిల్లులు చెల్లించాలని సిఎంను కలిసి కోరిన మంత్రి సురేష్
- వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని హామీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యుఎస్) ఆధ్వర్యంలో గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగీకరించారు. వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ట్యాంకర్ల బిల్లుల విషయమై కాంట్రాక్టర్లు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం సిఎం జగన్మోహన్‌రెడ్డిను కలిసి వివరించారు. దీనిపై స్పందించిన సిఎం బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం రూ. 236 కోట్ల,



మంత్రి సురేష్

34 లక్షల, 47 వేలు అవసరమని ఇంజినీర్ ఇన్ చీఫ్ కష్ణారెడ్డి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ విషయాన్ని మంత్రి సురేష్ సిఎం దష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సిఎం బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తికానున్న నేపథ్యంలో జిల్లాలో కాంట్రాక్టర్లు, ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజకవర్గం లోని కాంట్రాక్టర్లు అందరూ ఇంకా ఎవరైనా ఆన్‌లైన్‌లో బిల్లులను అప్‌లోడ్ చేయించకపోతే త్వరగా ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని మంత్రి సురేష్ తెలిపారు.

లోన్ తీసుకోకున్నా..

రుణం చెల్లించాలని వేధింపులు

- డ్వాక్రా సభ్యురాలి భర్త ఆత్మహత్యాయత్నం
- సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి-రేపల్లె

రుణం తీసుకోకపోయినా.. చెల్లించాలంటూ బ్యాంకర్లు వేధించడంతో ఓ డ్వాక్రా గ్రూప్ సభ్యురాలి భర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రేపల్లెలో జరిగింది. రేపల్లెలోని 21వ వార్డులో గతంలో మెప్మా పరిధిలో ఆర్పీలు ఇతర సిబ్బంది బ్యాంకర్ల సహకారంతో సుమారు 50 మంది డ్వాక్రా మహిళలను మోసం చేసి.. సుమారు మూడు బ్యాంకుల్లో ఒక్కో మహిళ పేరుతో రూ.ఆరు లక్షల నుంచి 8 లక్షల వరకు పలు బ్యాంకుల్లో లోన్లను తీసుకున్నారు. ఈ మోసం విషయంపై గతంలో బాధితులు మున్సిపల్ కమిషనర్‌కి, మెప్మా అధికారులకు వినతిపత్రం అందజేశారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు.

ఇటీవల మళ్లీ బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ వాళ్లు.. తీసుకున్న రుణం చెల్లించాలని నిత్యం డ్వాక్రా గ్రూప్ మహిళ గౌసియే ఇంటికి వస్తున్నారు. తాము బ్యాంకులో అప్పు తీసుకోలేదని ఆమె చెబుతున్నా వినిపించుకోలేదు. సోమవారం కూడా బ్యాంకర్లు వేధించారు. లోన్లు కట్టకుంటే మీ పేర్లు పోలీస్‌స్టేషన్లో, రైల్వేస్టేషన్, బస్టాండ్లో బహిరంగంగా అంటిస్తామని బెదిరించారు. దీంతో గౌసియా భర్త కరిముల్లా ఇంట్లో ఉన్న బీపీ టాబ్లెట్లన్నీ మింగి.. ఆత్మహత్యాయత్నం చేశాడు. కరిముల్లాను కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. డ్వాక్రా సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు సిపిఎం నాయకులు సిహెచ్ మణిలాల్ బాధితులను పరామర్శించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మణిలాల్ మాట్లాడుతూ ఒకే గ్రూప్ పేరుతో వివిధ బ్యాంకులలో రుణాలు ఇప్పించిన వారిపైనా, అక్రమంగా రుణ డబ్బు తీసుకున్న వారిపైనా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల వేధింపులు తాళలేక గ్రూపు మహిళ గౌసియా భర్త కరిముల్లా ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారని చెప్పారు. వీరి పిల్లలకు అమ్మ ఒడి డబ్బులు పడినా బ్యాంకుల వారు ఇవ్వకపోవడం, మరో పక్క రుణాలు తీసుకోకపోయినా చెల్లించాలని బ్యాంకర్ల వేధింపులు ఆత్మహత్యాయత్నంకు దారితీశాయన్నారు. డ్వాక్రా బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత డ్వాక్రా మహిళలు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



ఒడ్డుకు కొట్టుకొచ్చిన ముగ్గురి మృతదేహాలు

బోటు ప్రమాదంలో గల్లంతైన తల్లీబిడ్డలు మృతి

3లో

చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడిని సత్వరమే శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్

4లో

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని ముప్పవరం గ్రామంలో, ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు, విజయవాడ హెల్ప్ హాస్పటల్ వైద్యులు తెలిపారు. పంగులూరు మండల మాజీ జడ్పిటిసి కుక్కపల్లి ఏడుకొండలు, ఆంజనేయులు తల్లి అంజమ్మ పెద్దకర్మ సందర్భంగా సోమవారం ముప్పవరంలోని సొసైటీ దగ్గర ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ తుమ్మల సాయి 200 మంది రోగులను పరీక్షించి, ఈసీజీ, ఎకో టెస్టులు చేశారు. 30 మందిని విజయవాడ హెల్త్ హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. వీరికి ఉచిత వైద్య సేవలు అందిస్తామని, ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు.

అన్న క్యాంటీన్‌కు దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-బాపట్ల

పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ దాతల సహకార అభినందనీయమని నరేంద్రవర్మ అన్నారు. సోమవారం 295వ రోజు కర్లపాలెంకు చెందిన కొమ్మూరి సత్యవాణి జ్ఞాపకార్థం ఆమె భర్త మురళీకృష్ణమూర్తి కుమార్తెలు మాధవి, లత సహకారంతో నిర్వహించారు. సుమారు 350 మంది పేదలకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో భాగస్వాములై తమ సహకారాన్ని అందించిన దాతలకు నరేంద్రవర్మ ధన్యవాదాలు తెలియజేశారు.



అన్నదానం చేస్తున్న దాతలు

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-చీరాల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మహానాడు మినీ మేనిఫెస్టోని విడుదల చేయగా చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు టిడిపి మినీ మేనిఫెస్టోలో పొందుపర చిన పథకాలు చీరాల నగర్ పంచాయతీలో సోమవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించారు. తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరువతా యని అన్నారు. ఈ కార్యక్రమంలో గంజి పురుషోత్తం, ఆసాది వీర్లంకారెడ్డి, గవిని సోమయ్య, దుడ్డు శామ్యూల్, లావేటి శ్రీనివాస్ తేజ, తేలప్రోలు నాగేశ్వరరావు, ఎస్‌కె లాల్ అహ్మద్, గుత్తి వెంకట శివయ్య, యర్ర శివ నాగమల్లేశ్వరి, శింగిరేసు కాళిదాసు, అంగిరేకుల వెంకటేశ్వరరావు, జంగల్ భాస్కర్, పాలేటి సునీత, పులి శ్రీనివాసరావు, పడవల లలిత, పి లక్ష్మి, ఎస్‌కే ఫర్వాన, లీగల్ సెల్ పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, ఎం గోపి, పిట్టు కిషోర్, కౌతరపు నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గుండె పోటుతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

అద్దంకి డిపో నుంచి వినుకొండకు వెళుతున్న ఆర్టీసీ బస్సులో వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సోమవారం ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన ముదిగొండ కొండ గురవయ్య(77) ముండ్లమూరులోని తమ బంధువుల ఇంటికి వచ్చి సాయంత్రం గ్రామానికి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో అగ్రహారం గ్రామం దగ్గర గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. అతడి బంధువులకు అధికారులు సమాచారం అందించారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓఎస్ నెం.239/2022

కదం అనిత అలియాస్ అనిత కుమారి ...వాది
వర్సెస్
అయ్యపురాజు రాజేంద్రకుమార్ ...ప్రతివాదులు
ప్రతివాది అడ్రస్:-
అయ్యపురాజు రాజేంద్రకుమార్ తండ్రి చలపతి,
వ్యాపారం, రాములవారిగుడి ప్రక్కన, కమ్మబజారు
కొమరోలు గ్రామం& మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి సమన్లు పంపిన తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది:22.08.2023న ఉదయం 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 22.08.2023 **పిడతల రాజశేఖరరెడ్డి**
స్థలం: గిద్దలూరు **పిటిషనర్/వాది తరుపు అడ్వకేట్,**
తేది:21.08.2023 **గిద్దలూరు**
సెల్ నెం. **9948897433**

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.434/2020

పోలెపల్లె నరేంద్రకుమార్ ...వాది
వర్సెస్
బోగిశెట్టి వెంకటేశ్వర్లు ...ప్రతివాది
టు,
బోగిశెట్టి వెంకటేశ్వర్లు తండ్రి చిన్నయ్య,
హిందూ, సుమారు 60సం॥ల వయస్సు,
పెన్షనర్, 2వ వార్డు, అంకాలమ్మ బజారు,
గిద్దలూరు గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలువున్న యెడల తేది:31.08.2023న ఉదయం 10:30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ క్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

స్థలం : గిద్దలూరు **శ్రీ ఎస్.వి.నాగేంద్రబాబు**
తేది:21.08.2023 **వాదిపరం అడ్వకేట్,**
గిద్దలూరు. సెల్ నెం.**9866802375**

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.83/2023

శివాపురం హరిక్రిష్ణ ...వాది
వర్సెస్
శివాపురం సురేష్ ...ప్రతివాది
టు,
శివపురం సురేష్ తండ్రి లేట్ వెంకటేశ్వర్లు,
36సం॥లు, హిందూ, వ్యాపారం,
డోర్.నెం.1-3-13-4, నటరాజ్‌థియేటర్ బజార్
గిద్దలూరు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది:25.08.2023న ఉదయం 10:30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ క్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

స్థలం : గిద్దలూరు **శ్రీ ఎస్.వి.నాగేంద్రబాబు**
తేది:21.08.2023 **వాదిపరం అడ్వకేట్,**
గిద్దలూరు.
సెల్ నెం.**9866802375**

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S .No: 152/2023

బిట్వీన్:
షేక్ శైలజ ...వాది
మరియు
షేక్ బాల మీరావలి .... ప్రతివాది
టు,
షేక్ బాల మీరావలి, తండ్రి. షేక్ శ్రీను(లేటు),
నివాస డోర్ నెం:1- 97, గుంటుపల్లి గ్రామము,
బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాని వాది అయిన షేక్ శైలజ, ప్రతివాదితో జరిగిన వివాహమును రద్దుపరచమని కోరుచూ దాఖలు చేసిన దావాలో ప్రతివాది అయిన మీకు సమన్లు పంపించినను మీకు ముట్టనందున శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:11-09-2023కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:11-09-2023

డా.సయ్యద్ బాబు షేక్.LLM,Ph.D.,
ఎ.తిరుమల ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్స్,
హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర బ్యాంకు ప్రక్కన, నగరంపాలెం, గుంటూరు. సెల్:99851 79494

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT AT VISAKHAPATNAM
M.O.P.No.411/2019

Between:
Anisetty Veera Brahma Kishore ...Petitioner
And:
Uppu Kirankumar & Others ...Respondents

NOTICE

To:
Gullapalli Krishna Kishore,
S/o. Venkateswararao,
Owner of the Bus bearing
reg.no:AP 27 TW 4444,
R/at D.No:20-6-77,
32 Ward, Anjaiah Road,
Ongole, Prakasam Dist.
(2nd Respondent)

Please take notice that the above named petitioner has instituted the above MOP against the respondents for injuries sustained by the petitioner in a Road Accident and for other reliefs and the same stands posted to **28.08.2023 at 10.30 A.M.** for your appearance, on that day you are personally or through Advocate attend before the Honourable Court at 10.30 AM failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

A.VENU GOPALA KRISHNA
Advocate,
Visakhapatnam
Cell No.9849581441

GIDDALUR NAGARA PANCHAYAT

E-Procurement Tender notice Roc.No.48/2022/E1, Dt.21.08.2023
Nit No.46/2023-24/E1, Dated.21.08.2023 (1 work)
General Fund - Rs.4.50 Lakhs (1work)

Further Details can be seen at 'e' procurement Market place in www.eprocurement.ap.gov.in officer inviting bids Commissioner, Giddalur Nagara Panchayat, Giddalur, Andhra Pradesh.
Ph.8978382340

Sd/- xxxxxxxxxx
Commissioner
Giddalur Nagara Panchayat

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 66/2023

పార్శ సుబ్బమ్మ ...వాది
వర్సస్
ఇర్రి మోహన్ బాబు ...ప్రతివాది
To
ప్రతివాది చిరునామా
ఇర్రి మోహన్ బాబు తండ్రి నారాయణ
48సంవత్సరాల వయస్సు, హిందూ,
ఎక్స్ ఆర్మీ, కొమరోలు గ్రామము,
కొమరోలు మండలము, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ:23-08-2023న ఉదయం గం.10:30 నిమిషాలకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేదీ 21-08-2023

ఇట్లు
శ్రీ షేక్ ఉస్మాన్ షరీఫ్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 326/2022

వీరంరెడ్డి సుమతి ...వాది
వర్సస్
మద్దుల సుబ్బారెడ్డి ...ప్రతివాది
To,
ప్రతివాది చిరునామా
మద్దుల సుబ్బారెడ్డి తండ్రి పాపిరెడ్డి,
పూసలపాడు గ్రామము, బెస్తవారి పేట మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది మీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ రాగోరి దావా దాఖలు చేసినందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు దావాలో మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 25-08-2023వ తేదీ వాయిదా వున్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 21-08-2023

ఇట్లు
శ్రీ పి. యన్. శేషశయనా రెడ్డి.
శ్రీ యం. రంగారెడ్డి.
అడ్వకేట్స్, గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO 596/2022 IN O.S.NO 326/2022

వీరంరెడ్డి సుమతి ...పిటిషనర్/వాది
వర్సస్
మద్దుల సుబ్బారెడ్డి ...రెస్పాండెంట్/ప్రతివాది
To,
రెస్పాండెంట్ / ప్రతివాది చిరునామా
మద్దుల సుబ్బారెడ్డి తండ్రి పాపిరెడ్డి,
పూసలపాడు గ్రామము, బెస్తవారి పేట మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్‌లో పిటిషనర్ / వాది మీ నుండి దావా ప్రాంసరీ నోటు తాలూకు బాకీ రాగోరి దావా దాఖలు చేసి అందులో I.A.NO 596/2022 లో నీకు చెందినటువంటి దావా షెడ్యూల్ ఆస్థిని జడ్జిమెంట్ కంటే ముందే అటాచ్‌మెంట్ (Attachment before Judgement) కోరుతూ పిటిషన్ దాఖలు చేసినందున కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం సదరు I.A.NO 596/2022 పిటిషన్ లో మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 25-08-2023వ తేదీ వాయిదా వున్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 21-08-2023

ఇట్లు
శ్రీ పి.యన్. శేషశయనా రెడ్డి.
శ్రీ యం. రంగారెడ్డి.
పిటిషనర్/వాది పరం అడ్వకేట్స్,
గిద్దలూరు.

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయటం ఏమనగా నా క్లయింటు హైదరాబాద్, శ్రీనగర్ కాలని, జయ ప్రకాష్ నగర్ కాలనీ డోరునెం.8-3-318/6/3/13/20 రు గల ఇంటిలో నివసించుచున్న తానిగుండాల వెంకట రామిరెడ్డి గారి కుమారుడు తానిగుండాల సుధాకర్ రెడ్డి అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేయటం ఏమనగా నా క్లయింటు తేది. 29-07-2023 న పెళ్ళూరు గ్రామ కాపురస్తుడు ఈమని జాలయ్య గారి కుమారుడు ఈమని శివ అను వారి వద్ద నుండి నివేశన స్థలమును విక్రయ ఖరార్ అగ్రిమెంటు ద్వారా ఈ దిగువ షెడ్యూలు లోని 52 గదుల నివేశన స్థలమును కొనుగోలు చేసి ప్రస్తుతము నా క్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిష్టరు చేయించుకొనుటకు సిద్ధపడి ఉండియున్నాడు. ఈ షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి ఎవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలవడిన వారం రోజులలోపు నా క్లయింటుకు గానీ, ఈ దిగువ ఉదహరించిన సెల్ ఫోన్ నెంబరుకు గానీ తెలియపరచగలరు.

షెడ్యూలు:

ప్రకాశంజిల్లా ఒంగోలు స.రి. యిలాకా ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ లోని అన్నవరప్పాడు, పోతురాజుపాలెం నందలి 6వ వార్డు, 6వ బ్లాకు, అన్నవరప్పాడు గ్రామ సర్వేనెం.106/1, 106/2 రులో ప్లాను దాఖలా ప్లాటునెం. 174 రులోని 416.6/9 చ.గ.లు విస్తీర్ణంగా గల ఖాళీ స్థలమునకు హద్దులు :
తూర్పు: బజారు - యీ దిశ 50 అ.లు.
దక్షిణం : ప్లాటునెం. 72రులోని స్థిరాస్థి - యీ దిశ 75 అ.లు.
పడమర: నిల్వ స్థలం - యీ దిశ 50 అ.లు.
ఉత్తరం: ప్లాటు నెం. 175 రులోని స్థిరాస్థి - యీ దిశ 75 అ.లు.

ఇట్లు
కె. నాగేశ్వరరావు
అడ్వకేట్, ఒంగోలు.
Cell: 9703102929

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయటం ఏమనగా నా క్లయింటు ప్రకాశంజిల్లా, ఒంగోలు టౌను, ఆనందరావు రోడ్డు డోరునెం. 53-1-8 రు గల ఇంటిలో నివసించుచున్న అంబటి చిర్రయ్య గారి కుమారుడు అంబటి నెహెమ్య అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేయటం ఏమనగా నా క్లయింటు తేదీ 29-07-2023 న పెళ్ళూరు గ్రామ కాపురస్తుడు. ఈమని జాలయ్య గారి కుమారుడు ఈమని శివ అను వారి వద్ద నుండి నివేశన స్థలమును విక్రయ ఖరార్ అగ్రిమెంటు ద్వారా ఈ దిగువ షెడ్యూలు లోని 52 గదుల నివేశన స్థలమును కొనుగోలు చేసి ప్రస్తుతము నా క్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిష్టరు చేయించుకొనుటకు సిద్ధపడి ఉండియున్నాడు. ఈ షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి ఎవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలోపు నా క్లయింటుకు గానీ, ఈ దిగువ ఉదహరించిన సెల్ ఫోన్ నెంబరుకు గానీ తెలియపరచగలరు.

షెడ్యూలు :

ప్రకాశంజిల్లా, ఒంగోలు స.రి. యిలాకా ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ లో నీ అన్నవరప్పాడు. పోతురాజుపాలెం నందలి, 6వ వార్డు, 6వ బ్లాకు, అన్నవరప్పాడు గ్రామ సర్వేనెం. 106/2 రులో ప్లాను దాఖలా ప్లాటునెం. 73 రులోని 416.6/9 చ.గ.లు విస్తీర్ణంగా గల ఖాళీ స్థలమునకు హద్దులు:
తూర్పు: ప్లాటునెం. 75 రులోని స్థిరాస్థి - యీ దిశ 50 అ.లు.
దక్షిణం: బజారు - యీ దిశ 75అ.లు.
పడమర: బజారు - యీ దిశ 50 అ.లు.
ఉత్తరం: ప్లాటు నెం. 74 రులోని స్థిరాస్థి - యీ దిశ 75 అ.లు.

ఇట్లు
కె. నాగేశ్వరరావు
అడ్వకేట్, ఒంగోలు,
Cell 9703102929

బస్ డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

- నిరసనగా 40 హయ్యర్ బస్సులు సర్వీసులు నిలిపివేత
- నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేయాలని సిఐటియు డిమాండ్
- కేసు నమోదుకు సహకరిస్తామని డిఎం హామీ

ప్రజశక్తి-చీరాల

హైర్ బస్సు డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు దాడి చేశాడు. బాధిత డ్రైవరు శివయ్య ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. డ్రైవరుపై దాడిచేసిన ప్రయాణికుడు శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేసి డ్రైవర్, కండక్టర్లకు రక్షణ కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో హైయర్ బస్సు సర్వీసులను నిలిపివేసి సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఎన్ బాబురావు, ఎం వసంతరావు మాట్లాడుతూ హయ్యర్ బస్సు డ్రైవర్ శివయ్య తన విధుల్లో భాగంగా ప్రయాణికులను ఎక్కించుకొని ఆదివారం విజయవాడ నుంచి చీరాల డిపోకు బయలుదేరారని అన్నారు. విజయవాడ కష్ణలంక పోలీస్ స్టేషన్ వద్ద బస్సు ఆపాలని విజయవాడ గౌతమి విద్యాసంస్థలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న చీరాల ఈపురుపాలేనికి చెందిన ఊట్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి తన కారులో వస్తూ డ్రైవర్‌కు సైగలు చేశారన్నారు. అయితే ట్రాఫిక్ నిబంధనల రీత్యా తక్షణం బస్సు నిలిపేందుకు వీలుకాకపోవడంతో బస్సును కొంతదూరం తీసుకువెళ్లి ఆపాడన్నారు. దీంతో బస్సు ఎక్కిన శ్రీనివాసరావు డ్రైవర్‌తో వాదిస్తూ తానెవరో తెలుసా అంటూ ఘర్షణ పడ్డాడు. తన భార్య జిల్లాలోనే ఆర్టీసీ డిపిటిఓ అధికారి అంటూ తన గురించి పూర్తిగా తెలియదు అంటూ తోటి ప్రయాణికుల ముందు కండక్టర్, డ్రైవర్‌పై దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. జరిగిన సంఘటనను డ్రైవర్ వీడియో తీస్తుండడంతో ఫోన్ లాక్కొని శ్రీనివాసరావు బీభత్సం డ్రైవర్‌పై దాడిచేసి గాయపరిచాడు. చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు డ్రైవర్‌పై ఫిర్యాదు చేసి మీ సంగతి చూస్తా అంటూ బెదిరించసాగాడు. దాడిలో గాయపడిన డ్రైవర్ శివయ్యను హయ్యర్ బస్సు సిబ్బంది చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ సిబ్బందిపై ప్రయాణికులు దాడి చేయడానికి ఖండిస్తూ విజయవాడ, ఒంగోలు, నరసరావుపేట, ఆర్డినరీ సుమారు 40 సర్వీసు బస్సులను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ ఉన్నత అధికారులు హయ్యర్ బస్సు సిబ్బందిని సున్నితంగా సముదాయించే ప్రయత్నాలు చేసినా.. తమకు న్యాయం చేయాలని కార్మికులు నిరసన కొనసాగిస్తుండడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.


చీరాల ఆర్‌టిసి బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

దాడి చేసిన శ్రీనివాసరావును అరెస్టు చేయాలి

ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన శ్రీనివాసరావును పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం బాపట్ల ఆర్ఎం చీరాల డిఎం శ్యామలతో చర్చలు జరిపారు. శ్రీనివాసరావుపై కేసు నమోదుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. దాడిచేసి గాయపరిచిన శ్రీనివాసరావు వైద్య ఖర్చులు మొత్తం భరించాలని, అందుకు ఆర్టీసీ యాజమాన్యం బాధితుడికి న్యాయం చేయాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమం సాయంత్రం వరకు జరిగింది. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న డ్రైవర్ శివయ్యను సిఐటియు నాయకులు హయర్ బస్సు సిబ్బంది పరామర్శించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి బి శ్రీనివాసరావు, తులసిరావు, కెబికె రెడ్డి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైయిర్ బస్సు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రం నాగిరెడ్డి, వి వెంకటేశ్వర్లు, టి వెంకటేష్, ఎం చందు, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక చంపేశారు.. భార్య, తల్లి కలిసి హత్య..

ప్రజాశక్తి-యద్దనపూడి

నిత్యం తాగి.. ఇంట్లో వాళ్లని వేధిస్తున్న వ్యక్తిని భార్య, తల్లి కలిసి హతమార్చిన ఘటన యద్దనపూడి మండలంలోని యనమదలలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. యనమదలకు చెందిన రాయి చెన్నయ్య(42) తాగుడుకు బానిసై..నిత్యం ఇంట్లో భార్యను, తల్లిని హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక అతడిని హత్య చేయాలని భార్య కవిత, తల్లి వెంకాయమ్మ భావించారు. భార్య గొంతుకు తాడు వేసి బిగించగా.. తల్లి కాళ్లు పట్టుకుంది. దీంతో చెన్నయ్య మృతిచెందాడు. గ్రామ విఆర్ఒ సత్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మార్టూరు సిఐ ఫిరోజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా - 12 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటన కొండపి మండలంలోని ముప్పవరం గ్రామ శివారులో ఉన్న మలుపు వద్ద చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్లగా పొదిలి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు రోజు కూలీ పనికోసం పక్క మండలంలోకి వెళుతున్నారు. అదే విదంగా సోమవారం నాడు కూడా పనికి వెళ్తున సమయంలో కొండపి మండలం ముప్పవరం గ్రామ శివారులో ఉన్న మలుపు వద్ద ఆటో అదుపు తప్పి పొలాలలోకి పల్టీకొట్టింది. ఈ సంఘటనలో దాదాపు 12 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. అటువైపు వెలుతున్న ప్రయాణికులు వారిని గమనించి వెంటనే వేరే వాహనంలో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి ప్రథమ చికిత్స అందజేశారు. వారిలో ద్వారసల ప్రసన్న, కంచాని కొండమ్మ, పులవర్ల సుబ్బయ్య, కంచాని నారాయణరెడ్డి, మడతల రమణమ్మ, పడికిపాటి పద్మ పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం రెండు 108 వాహనాలలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారు పలగర ఓబులమ్మ, కనకం సుబ్బులు, ఇండ్ల వెంకటలక్ష్మి, కొలగరి రోశమ్మ, కొలగరి బాగ్యం , తలకుల కొండమ్మకు స్వల్ప గాయాలు అయ్యాయి.

బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తర్లుపాడు

రెండు బైకులు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్రగాయాలు గాయాలైన సంఘటన తర్లుపాడు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. కంభం మండలం లింగోజిపల్లి గ్రామానికి చెందిన రావూరి లక్ష్మీనారాయణ (53) లింగోజిపల్లి నుండి మార్కాపురంకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో తర్లుపాడు రైల్వేస్టేషన్ వద్ద రైల్వేస్టేషన్‌లో నుంచి అడ్డుగా వచ్చిన గుర్తు తెలియని మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో లక్ష్మీనారాయణకు తలకు, కాళ్ళకి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ని ఢీ కొట్టిన వ్యక్తి అక్కడి నుండి పరారయ్యాడు. అటుగా వెళుతున్న స్థానికులు గాయలైన వ్యక్తికి తర్లుపాడులోని ఓ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీసీ నాయకుడికి బెదిరింపులు

గిద్దలూరు రూరల్ : గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీ పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ పార్టీ అభివద్ధి కోసం నిరంతరం కషి చేస్తున్న గిద్దలూరు మండలం ఎగ్గెన్నపల్లె గ్రామానికి చెందిన బీసీ నాయకులు కొప్పుల నరసింహులు తనకు బెదిరింపు పోన్ కాల్స్ ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తపరిచాడు. రాబోవు 2024 ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరపున నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు, తద్వారా ప్రజల్లో వస్తున్న ప్రచారం తట్టుకోలేక అదే పార్టీలో కొంతమంది అగ్రకులాలకు చెందిన నాయకులు ఫోన్లో బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఈ ప్రజాస్వామ్యంలో బీసీలు ఎమ్మెల్యేగా పోటీ చేసే హక్కు లేదా అని మనోవేదన చెందుతున్నారు.

నాణ్యతతోనే వ్యాపారాభివృద్ధి

ప్రజాశక్తి-టంగుటూరు

నాణ్యమైన వస్తువులను విక్రయించడం ద్వారానే వ్యాపారం దిన దినాభివద్ధి చెందుతుందని కొండపి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సూచించారు. సోమవారం స్థానిక సింగరాయకొండ రోడ్డులో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తూరి రవికుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రవి రైస్, బ్యాటరీ వరల్డ్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులను మాత్రమే దుకాణంలో విక్రయించాలని, తద్వారా వినియోగదారులకు మన దుకాణంపై నమ్మకం పెరిగి వ్యాపారం అభివద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు పోతుల నరసింహారావు, బీనీడి ఉదయ్ కుమార్, చిడిపోతు వెంకటేశ్వర్లు, డాక్టర్ కష్ణారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొంజేటి సత్యనారాయణ, మర్లపాడు కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బోటు ప్రమాదంలో గల్లంతైన తల్లీ బిడ్డలు మృతి


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మోపిదేవి

ప్రజాశక్తి - నిజాంపట్నం : నిజాంపట్నం హార్బర్ సమీపంలోని మొగ వద్ద ఆదివారం జరిగిన ఫైబర్ బోటు బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు గల్లంతైన సంఘటన తెలిసిందే. అయితే గల్లంతైన వారికోసం మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులతో పాటు గజ ఈతగాళ్లు సముద్రంలో గాలింపు చర్యలను ముమ్మరం చేసి సోమవారం సాయి వర్ణిక (25), తన్విష్ కుమార్ (7), తరుణ్ ఈశ్వర్ (11 నెల బాబు) మతదేహాలను వెలికి తీసి బయటకు తీసుకొచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు నిజాంపట్నం ఎస్ఐ రమేష్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

నిజాంపట్నం హార్బర్ సమీపంలోని మొగ వద్ద ఫైబర్ బోటు బోల్తా పడిన ప్రమాదంలో తల్లితో సహా ఇద్దరు పిల్లలు మతి చెందడం దూరదుష్టకరమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు విచారం వ్యక్తం చేశారు. హార్బర్ సమీపంలోని మొగ వద్ద ఆదివారం జరిగిన ఫైబర్ బోటు బోల్తా పడిన ప్రాంతాన్ని సోమవారం అయన పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేలు రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంపీ మోపిదేవి భరోసా ఇచ్చారు. సముద్రంలో వేటాడుతూ ప్రమాదం జరిగి మరణించే మత్స్యకారులకు ప్రభుత్వం రూ.10 లక్షల రూపాయల భీమా సౌకర్యం కల్పిస్తుందని ఎంపీ మోపిదేవి తెలిపారు. ఎంపీ వెంట వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, బోటు యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, తహశీల్దార్ నెహ్రూ బాబు, ఎంపీటీసీ నాజర్ ఖాన్, కన్నా శ్రీను, మార్కండేయులు, సివిల్ - మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

శింగరాయకొండలో పేకాట రచ్చ

- సెబ్ పోలీస్ స్టేషన్ ముందు వైసిపి నాయకుల ఆందోళన
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ సెబ్ పోలీస్‌స్టేషన్ ముందు సోమవారం స్థానిక వైసీపీ నాయకులు రచ్చ చేశారు. గత రెండు రోజుల క్రితం పాత శింగరాయకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని.. వారి నుంచి రూ.1.55 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో వైసీపీ నాయకులు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు (చిన్నా) అనుచరులు ఉన్నారు. పేకాట ఆడకపోయినా ఆ చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్నందు వల్ల తమపై కేసు పెట్టి డబ్బులు తీసుకున్నారని వెంకటేశ్వర్లు అనుచరులు ఆరోపిస్తున్నారు. సోమవారం మూలగుంటపాడులో ఉన్న సెబ్‌పోలీస్ స్టేషన్ దగ్గరకు చేరుకొని సెబ్ ఎస్సై దయాకర్‌పై యన్నబత్తిన చిన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. పేకాట జూదరుల వద్ద, ఇసుక రవాణా, మద్యం అమ్మకాల్లో వాటాలు తీసుకుంటూ సెబ్ పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం చేశారు. పోలీస్‌స్టేషన్ ముందే కుర్చీలు వేసుకొని మరీ వైసిపి నాయకులు ఎస్ఐపై ఆరోపణలు చేశారు. సెబ్ ఎస్ఐ దయాకర్ శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సిఐ వైసిపి నాయకులు యన్నాబత్తిని చిన్నాతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సై దయాకర్ ఉన్నతాధికారులకు సమాచారం అందజేయటంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని దయాకర్‌కు సూచించారు. దీంతో దయాకర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న యన్నాబత్తిని చిన్నా మరోసారి పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి సెబ్ ఎస్సై దయాకర్ అవినీతి చిట్టా తన వద్ద ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఎస్ఐ ఎంత దూరం పోయినా తాను తగ్గే సమస్యే లేదన్నారు. దయాకర్ ఫిర్యాదు మేరకు యన్నాబత్తిన చిన్నాపై ఎస్ఐ శ్రీరాం కేసు నమోదు చేశారు.

మండల అభివృద్ధికి కృషి: ఎంపిపి

ప్రజాశక్తి-నగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు చింతల శ్రీకృష్ణయ్య హాజరై మాట్లాడారు. నగరం మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డారని అన్నారు. రెండో పంటకు కూడా సకాలంలో నీళ్లు అందిస్తున్నామని అన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా సుమారు 300 కోట్ల రూపాయల పైచిలుకు నగరం మండలం లోని ప్రజలకు అందించినట్లు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బాపట్ల జిల్లా లోనే అత్యధిక ఉపాధి హామీ పనులు చేసిన మండలంగా నగరం గుర్తింపు పొందిందని అన్నారు. సుమారు రూ.30 కోట్లకు పైగా పనులు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, సర్పంచి పోగోలు సుజాత వెంకటేశ్వరరావు, తాడివాక అనిల్ కుమార్, పఠాన్ జాఫర్ పాల్గొన్నారు.

సిఐగా నిమ్మకూరి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం గ్రామానికి చెందిన నిమ్మకూరి వెంకటేశ్వరరావుకు సిఐగా పదోన్నతి లభించడం పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర డిజిపి ఉత్తర్వుల మేరకు కొద్దిరోజుల క్రితం అర్హత కలిగిన కొంతమంది ఎస్ఐలు, సీఐలుగా ఉద్యోగోన్నతి పొందిన విషయం విదితమే. గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ స్థాయి నుంచి 13 మంది సీఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ 13 మంది సీఐలను గుంటూరు రేంజ్ పరిధిలోని వివిధ జిల్లాలకు కేటాయిస్తూ, వారికి ఆ జిల్లాల్లో పోస్టింగులు ఇస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం నూతన సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఎన్ వెంకటేశ్వరరావు పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ విభాగానికి సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసు ప్రతిష్ట మరింతగా ఇనుమడించే విధంగా ప్రజలకు సేవలందించాలని ఇరువురికి ఎస్పి అభినందనలు తెలిపారు. సీఐ ఎన్ వెంకటేశ్వరరావు నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

ప్రజాశక్తి-కారంచేడు

బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 36 మంది విద్యార్థులకు సోమవారం డైరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఈ డైరీలు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ప్రతిరోజూ పాఠశాలలో బోధించిన పాఠాలను ఇంటివద్ద రివ్యూ చేసుకోవడానికి ఈ డైరీలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. విద్యార్థులు అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కే సువర్ణ బాబు, అంగన్‌వాడీ కార్యకర్త సునీత, భాగ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై జాతీయ స్థాయి కార్యక్రమం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై ఏడు రోజుల జాతీయ స్థాయి ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారని అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం వారి ఆధ్వర్యంలో ది. 21-8-2023 నుంచి 7 రోజుల పాటు క్లౌడ్ కంప్యూటిగ్‌పై అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ క్రింద నిర్వహిస్తున్నారని కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ వర్క్ షాపును బ్రైన్ ఒ విజన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సిఎస్ఇ విభాగాధిపతి పి హరిణి తెలిపారు. ఈ వర్క్ షాపునకు న్యూఢిల్లీ ఎ.ఐ.సి.టి.ఇ చీఫ్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ బుధా చంద్రశేఖర్, ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తూ కళాశాల ప్రధాన అధ్యాపకులు మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ ఆధునిక కంప్యూటర్ రంగంలో ప్రముఖపాత్ర వహిస్తున్నదని తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ క్లౌడ్ కంప్యూటింగ్ ను ఉపయోగించి వివిధ రకాలైన సమస్యలకు తగిన పరిష్కారాలను కనుగొనుటపై అధ్యాపకులకు అవగాహన కల్పించి వాటిపై ప్రాక్టికల్స్ నిర్వహిస్తారని విభాగాధిపతి పి హరిణి తెలిపారు.

భాష్యం స్కూల్‌ను మూసేయాలి: ఎస్ఎఫ్ఐ

అనుమతి లేని పాఠశాలతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో అనుమతుల్లేకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్న భాష్యం పాఠశాలకు విద్యా శాఖ కొమ్ముకాయడంలో అంతర్యమేమిటని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి ఆర్య ప్రశ్నించారు. సోమవారం బాపట్ల ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు వ్యతిరేకమని మాయ మాటలు చెబుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు అండగా నిలుస్తోందని విమర్శించారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో కొత్తగా ఏర్పాటు చేసిన భాష్యం హైస్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేవని, ప్రభుత్వ గుర్తింపులేదని అన్నారు. ఏ విధమైన అనుమతులు లేని భాష్యం హైస్కూల్‌ను నిర్వహిస్తుంటే బాపట్ల విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా కళ్లెదుటే భాష్యం స్కూల్ నిర్వహిస్తుంటే విద్యా శాఖ మొద్దు నిద్ర నటిస్తోందన్నారు. ఎలాంటి అనుమతులు లేని భాష్యం విద్యా సంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఇప్పటికైనా అనుమతులు లేని భాష్యం హైస్కూలును మూసేయించాలని డిమాండ్ చేశారు. అనుమతులు రాకుండానే బాపట్లలో కరపత్రాలు బ్యానర్లు వేసి ప్రచారం చేసి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించి మోసం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ చేసిన విజ్ఞప్తులతో ఒకసారి పాఠశాలను మూసేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్య

చిన్నారిపై అత్యాచారం చేసిన

నిందితుడిని సత్వరమే శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరులో రెండ్రోజుల క్రితం పాఠశాలకి వెళ్లిన ఆరేళ్ల చిన్నారిపై స్కూలు పక్కనే కాలనీకి చెందిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అని, నిందితుడిని సత్వరమే శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల క్రితం ఇదే జిల్లాలో చెరుకుపల్లి మండలంలో అమర్నాథ్ చనిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని చెప్పారు. వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి అత్యాచారానికి పాల్పడిన వారిని తక్షణమే శిక్షించాలన్నారు. మహిళలు, చిన్నారులపై ప్రతిరోజూ ఏదో ఒకచోట అత్యాచారం, హింస వంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం వీటిని నివారించలేకపోతోందన్నారు. నిందితులను అరెస్టు చేసి ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినప్పటికీ బెయిల్‌పై స్వేచ్ఛగా తిరుగుతున్నారని చెప్పారు. ఇటువంటి వారికి శిక్ష పడేవరకు బెయిల్ రాకుండా జైల్లో ఉంచేందుకు అవసరమైన చట్టాలు చేయాలన్నారు. గ్రామాల్లో యువకులు మద్యానికి బానిసలవటం వల్ల ఈ తరహా ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. విచ్చలవిడిగా మద్యం సేవించి అత్యాచారాలకు పాల్పడుతున్న ఘటనలు రాష్ట్రంలో పెరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, ఐద్వా నాయకులు టి సుభాషిణి, ఎస్ఎఫ్ఐ ఆర్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బాధిత చిన్నారి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన లైంగిక దాడి హేయమని మాజీమంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా అన్నారు. చిన్నారి కుటుంబానికి అండగా ఉంటామని, చిన్నారి చదువులకు అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పాఠశాలను విలీనం చెయ్యటం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఉన్న పాఠశాలను అక్కడే ఉంచి అవసరమైన వసతులు కల్పిస్తే చిన్నారుల కుటుంబాలకు అందుబాటులో ఉండేదని అన్నారు. దీనిలో మంత్రి నాగార్జున కుట్ర దాగి వుందని ఆరోపించారు. అలాగే చిన్నారిపై లైంగిక దాడి జరిగితే కనీసం పోలీసులు కేసు పెట్టకపోవటం దురదృష్టకరమన్నారు. స్థానిక టిడిపి, బిసి సంఘం నాయకులు పట్టుబట్టి చిన్నారిని వైద్య పరీక్షలు చేయిస్తే అప్పటికి పోలీసులు కేసును నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో చిన్నారులు, మహిళలు, విద్యార్థులకు రక్షణ లేకుండాపోయిందని ఆరోపించారు. ఇక్కడ పాఠశాల విలీనంతో పాటు ఇక్కడ ఉన్న పోలింగ్ బూత్‌ను కూడా మంత్రి తన ప్రాంతంలోకి మార్చుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. చిన్నారిపై జరిగిన ఘటన బాధాకరమని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా, టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, బట్టు మల్లిఖార్జునరావు, కరుణ శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, సుందరరావు తదితరులు ఉన్నారు.

రాజకీయం చేయటం తగదు: మంత్రి

వెల్లటూరులో చిన్నారిపై జరిగిన ఘటనపై మాట్లాడాలే తప్ప అనవసర రాద్ధాంతం చెయ్యటం సరికాదని మంత్రి నాగార్జున మాజీ మంత్రి నక్కా ఆనందబాబు నుద్దేశించి వ్యాఖ్యానించారు. వెల్లటూరులో సోమవారం బాధిత చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన ఆనందబాబు చేసిన వ్యాఖ్యలపై నాగార్జున వేమూరులో విరుచుకుపడ్డారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని అన్నారు. మాజీ మంత్రి బాధితులను పరామర్శించి న్యాయంపై మాట్లాడాలి కానీ పాఠశాల విలీనం, పోలింగ్ బూత్ మార్పు గురించి మాట్లాడటం సరికాదని అన్నారు.

నిందితుడిని పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి

భట్టిప్రోలు మండలం వెల్లటూరులో చిన్నారిపై జరిగిన లైంగిక దాడికి కారకుడైన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి మనోజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ వర్మ కమిటీ సిఫారసును అమలు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నిందితుడికి 45 రోజులలోగా శిక్షపడే విధంగా చూడాలని అన్నారు. మద్యానికి బానిసైన యువకులు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయోజనకరంగా రైతు ఉత్పత్తి సంఘాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులకు మరింత ప్రయోజనం కల్పించేలా రైతు ఉత్పత్తి సంఘాలు ఉండాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. నాబార్డ్ ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు ఉత్పత్తి సంఘాల నిర్వహణ, నూతన సంఘాల నిర్మాణంపై స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రైతు ఉత్పత్తి సంఘాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని కలెక్టర్ చెప్పారు. నాబార్డ్ ఆధ్వర్యంలో 17 రైతు ఉత్పత్తి సంఘాలు నడుస్తున్నాయని వివరించారు. ఎఫర్ట్ సంస్థ కింద జిల్లాలో 40 రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పిఓ) నడుస్తున్నాయని చెప్పారు. ఒక్కొక్క సంఘంలో 350 మందికి తగ్గకుండా రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. సెర్ప్ సంస్థ కింద మూడు రైతు ఉత్పత్తి సంఘాలు కొనసాగుతున్నాయన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డిఎం కృష్ణానాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు, మత్స్య శాఖ అధికారి పి సురేష్, సహకారశాఖ అధికారి రామారావు, ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు పి జెన్నెమ్మ, సంస్థల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణకు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారికంగా ఆమోదించారు. ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. అనంతరం ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే విద్యార్థులు సత్ఫలితాలతో ఉత్తీర్ణులవుతారని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పోస్టులు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో ఒప్పంద పద్ధతిపై ఐదు పోస్టులు భర్తీకి కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్, వైఎజిసిడబ్ల్యుఏ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిహెచ్ రవణమ్మ, అద్దంకి డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మోహన్‌రావు, బాపట్ల కళాశాల ప్రధానాచార్యులు కె మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పునరావృతం కారాదు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్, జిల్లా పంచాయతీ అధికారి, సిపిడిసిఎల్ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఎక్కువగా పెండింగులో ఉన్నాయన్నారు. అధికారులు స్పందన అర్జీలు రీ ఓపెన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మిశివజ్యోతి, సిపిఓ భరత్ కుమార్, డిపిఓ రాంబాబు, డ్వామా పిడి శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, పశు సంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, మత్స్య శాఖ జెడి సురేష్, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, పౌర సరఫరాల శాఖ డిఎస్ఓ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఏ భానుప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-రేపల్లె

పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని రైలుపేటలో ఉన్న శ్రీ రామకృష్ణ విద్యానిలయం ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో బోధనాభ్యసన పరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ రామకష్ణ విద్యాపీఠం ఆదర్యంలో నడుస్తున్న పాఠశాల అభివద్ధికి దాతలు సాయం అందించాలని కోరారు. తన వంతు సాయంగా పాఠశాల అభివృద్ధి కోసం రూ.1,50,000 చెక్కును పాఠశాల సిబ్బందికి అందజేశారు.

ప్రజలు శాంతి సామరస్యంతో జీవించాలి

ప్రజాశక్తి బాపట్ల: ప్రజల శాంతి సామరస్యంతో సోదర భావంతో జీవనం సాగించేందుకు ప్రార్థన మందిరాలు దోహద పడతాయని బాపట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు సోమవారం బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవంలో నరేంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కమల శివ, గుడిపల్లి సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్, సుబ్రమణ్యరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డివిజన్‌ను వెంటనే కరవు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేసింది. మార్కాపురం డివిజన్‌ను కరవు ప్రాంతంగా ప్రకటిచాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య మాట్లాడుతూ తీవ్రమైన కరవు ఛాయలు నెలకొన్న నేపథ్యం, వర్షాభావ పరిస్థితుల దష్ట్యా మార్కాపురం రెవెన్యూ డివిజన్‌ను కరవు ప్రాంతంగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ పోయి రబీ సీజన్ వచ్చినప్పటికీ వర్షపు జాడ లేదన్నారు. చాలా మంది రైతన్నలు సాగు ప్రారంభించలేదన్నారు. మరి కొందరు ప్రకృతి అనుకూలించకపోతుందా అని సాగు చేశారన్నారు. ఆ విధంగా సాగు చేసిన వారందరూ నష్టాలు చూడక తప్పదన్నారు. కనీసం తాగునీటి అవసరాలకు సైతం డివిజన్‌లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇంతటి కరవు పరిస్థితి గతంలో ఎదురు కాలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలన్నారు. మార్కాపురం డివిజన్‌లో నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. కరవు ప్రాంతంగా ప్రకటించి రైతులను, ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని సోమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ పాటికే సాగు చేసిన మిర్చి, కంది, పత్తి పంటలు పనికిరాకుండా పోయాయన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేయాలన్నారు. విత్తనాలు మరోసారి పంపిణీ చేయాలన్నారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం. రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం మండల కార్యదర్శి తురక ఏడుకొండలు, విద్యార్థి సంఘం నాయకులు కొమ్ము విజయకుమార్, పి.లోకేష్, రైతు సంఘం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సిపిఎం నాయకులు పందిటి రూబెన్, బలుసుపాటి కాశయ్య, జెక్కి వెంకటేశ్వర్లు, షేక్ నన్నేసా, షేక్ జబ్బార్, సంపతి శ్రీనివాసులు, వినుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు


రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

'సజ్జల'ను కలిసిన వైపాలెం నేతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలో ఆయన క్యాంపు కార్యాలయంలో యర్రగొండపాలెం నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువలు, పూలమాలలు, బొకేలతో రామకృష్ణారెడ్డిని సత్కరించారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ మజీద్, వైసిపి పెద్దారవీడు మండల కన్వీనర్ కృష్ణారెడ్డి ఉన్నారు. **పెద్దారవీడు :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకష్ణారెడ్డిని వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్ణారెడ్డి తాడేపల్లిలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వేసవిలో మండలంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని, ముంపు గ్రామాల ప్రజలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. మండల పరిధిలోని సమస్యలు, అభివద్ధిపై కృష్ణారెడ్డి సజ్జలతో చర్చించారు. సానుకూలంగా స్పందించిన సజ్జల ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బస్సులో పసి కందును వదిలేసిన తల్లి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పసి కందును సంచిలో పెట్టి ఆర్‌టిసి బస్సులో వదిలి వెళ్లిన తల్లి ఉదంతం సోమవారం వెలుగు చూసింది. మార్కాపురం నుంచి దోర్నాల వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో దేవరాజుగట్టు సమీపంలో పసి కందుతో ఓమహిళ బస్సులో ఎక్కింది. ఆ తర్వాత కొంత దూరం వెళ్లిన తర్వాత పసి కందును సంచిలో పెట్టి ఆమె బస్సు దిగి వెళ్లిపోయింది. ముస్తఫా అనే యువకుడు సంచిలో పసికందు ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని కండెక్టర్‌కు తెలియజేశారు. దీంతో కండెక్టర్ దోర్నాలకు చేరుకొని జరిగిన విషయాన్ని ఎస్‌ఐ అంకమరావుకు వివరించారు. ఎస్‌ఐ అంకమరావు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ భార్గవి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రసూల్ పసికందుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆడపిల్ల పుట్టడం వల్లనే భర్త వేధింపులు తాళ్లలేక, చంపడానికి చేతులు రాక తల్లి పసి కందును బస్సులో వదిలి వెళ్లి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

'బాటా' షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బాటా షోరూంను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు మంచి క్వాలిటీతో పాదరక్షలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జంకే వెంకటరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని పలు పాఠశాలల్లో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు నాడు-నేడు ప్రోగ్రామ్ మానిటరింగ్ సభ్యులు కె.సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. కొండపి జడ్‌పిహెచ్‌స్కూల్ కె.ఉప్పలపాడు, జడ్‌పిహెచ్‌స్కూల్ వెన్నూరు, జడ్‌పిహెచ్ స్కూల్, ముప్పవరం జిహెచ్‌స్, కొండపి ఎంపిపిఎస్. పెట్లూరు జడ్‌పిహెచ్ స్కూల్ నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కె.నరసింహారావు, ఎంఇఒ-2రామారావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

కొమరోలు : మండల పరిధిలోని ద్వారకచర్ల బస్‌స్టాండ్ సెంటర్‌లో తాగునీటి పైపు లైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరంతా వృథా అవుతోంది. మూడు నెలలుగా తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌ను మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూకబ్జాలకు పాల్పడితే ఉపేక్షించను

ఎమ్మెల్యే బాలినేని హెచ్చరిక

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒంగోలులోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.47లక్షల చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి సంక్షేమ పాలనను అందిస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా పేదలకు సహాయం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్నవారంతా బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్న విషయాన్ని ఈ సందర్భంగా విలేకర్లు బాలినేని శ్రీనివాసరెడ్డి వద్ద ప్రస్తావించారు. ఈవిషయంపై స్పందించిన బాలినేని ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. శ్రీగిరి కొండమీద ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు తన దృష్టికి వచ్చిందని, వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఆక్రమణదారులు తమ పార్టీ వారైనా సరే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడ భూ ఆక్రమణలు జరిగినా అవి తన అండదండలతోనే జరుగు తున్నాయని మీడియాలో కథనాలు ప్రచురించడం సమంజసం కాదన్నారు. తన వివరణ తీసుకొని వార్తలు ప్రచురించాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

కమిషనర్ స్పందనకు 17 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై 17 ఫిర్యాదులు అందజేశారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్ సెక్షన్‌లవారీగా సమస్య పరిష్కారానికి నిర్ణీత గడువులోపు చర్యలు తీసుకోవాలని సెక్షన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు వారి సమస్యలపై ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసి, పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-దర్శి

సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం ప్రభుత్వానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు ప్రతియేడాది ఆగస్టు 31 అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రక్క ఐవికెలు పూర్తిచేయిస్తూ మరోప్రక్క డ్రాప్ అవుట్లను బడిలో చేర్పుకోమని ఉపాధ్యాయులను పురమా యిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నమోదు ప్రక్రియ వెబ్‌సైట్‌ను నిలుపుదల చేసి సర్దుబాటు ప్రక్రియను జులై 31 వరకూ ఉన్న విద్యార్థుల రోల్ ప్రకారం సర్దుబాటు చేయడం విద్యావ్యవస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విమర్శించారు. ఇప్పటివైనా స్పందించి సర్దుబాటు ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. జులై 31 కట్ ఆఫ్ తేదీని సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు మీనిగ శ్రీను, ప్రధానకార్యదర్శి పి. ఖాసిం, జిల్లా కార్యదర్శి డి. వెంకటరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు టి. చెంచయ్య, కోశాధికారి కె రామారావు, కార్యదర్శులు జె.రవికుమార్, కె.విజయభాస్కర్, ఎస్. కోటిరెడ్డి, షేక్ అల్లాబక్షు, మీరా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ...

సుందరయ్య కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సుందరయ్య కాలనీలో సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించి కోరుతూ ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట కాలనీవాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకుడు పి.రూబెన్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణ పరిధిలోని మూడవ వార్డు సుందరయ్య కాలనీలో దాదాపు 400 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే కాలనీలో మౌలిక వసతులైన నీరు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, శ్మశాన వాటిక లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితంగా లేకుండా పోయిందన్నారు. శ్మశాన వాటిక లేకపోవడంతో సుందరయ్య కాలనీ, ఏకలవ్య కాలనీ, శాంతినగర్ కాలనీలకు చెందిన ప్రజలు ఎవరైనా మతి చెందినట్లయితే వారి మతదేహాలను ఖననం చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గత్యంతరం లేక మార్కాపురం చెరువు అలుగు స్థలం వద్ద మృతదేహాలను ఖననం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సుందరయ్య కాలనీలో నెలకొన్నసమస్యలను పరిష్కరించాలన్నారు. శ్మశాన వాటిక స్థలం కేటాయించాలన్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఉప కలెక్టర్ సేధు మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎం.రంగయ్య, చిన్న జార్జి, రామలింగయ్య, కాశయ్య, షేక్ కరీం బాషా, హుస్సేన్, శ్రీనివాసులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అధికధరలు చూసి రైతులు మోసపోవద్దు

పొగాకు బోర్డు ఇడి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రస్తుత ధరలు శాశ్వతం కాదని, ఈ ధరలను చూసి పొగాకు రైతులు అధిక ధరలకు బ్యారన్లు, భూములను కౌలుకు తీసుకొని మోసపోవద్దని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు తెలిపారు. స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డులో వేలం తీరును శ్రీధర్ బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పొగాకుకు డిమాండ్ క్రమేపి తగ్గుతుందన్నారు. రైతులు దాన్ని పరిగణలోకి తీసుకొని బోర్డు నిబంధనలు పాటిస్తూ పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. తూర్పునాయుడుపాలెం, కాకుటూరువారి పాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,258 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,216 బేళ్ల అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 42 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.272, అత్యల్ప ధర రూ.159 నమోదైనట్లు ఎవో అట్లూరి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, బోర్డు సభ్యులు పొద వరప్రసాదరావు, బోడపాటి బ్రహ్మయ్య, రైతు ప్రతినిధులు పోతుల నరసింహారావు, మక్కెన వెంకట్రావు పాల్గొన్నారు. **కొండపి :** పొగాకు రైతులు వచ్చే సంవత్సరం పొగాకు బోర్డు అనుమతికి మించి పంట సాగు చేయవద్దని బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధరబాబు తెలిపారు.కొండపి పొగాకు వేలం కేంద్రాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా వేలం ప్రక్రియను, వివిధ గ్రేడుల పొగాకుకు వచ్చిన ధరలను పరిశీలించారు. అనంతరం పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సెక్రెటరీ డి.వేణుగోపాల్, ఒంగోలు రీజనల్ మేనేజరు ఎం.లక్ష్మణరావు, కొండపి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు, పొగాకు బోర్డు సభ్యులు బి.బ్రహ్మయ్య, పి.వరప్రసాదరావు తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 1,026 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 963 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 63 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర కిలో రూ.272, అత్యల్ప ధర కిలో రూ.150, సరాసరి ధర కిలో రూ. 260.87 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.



టంగుటూరులోపొగాకు వేలం తీరును పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు



మోహనరావును సన్మానిస్తున్న అధికారులు

అవార్డు గ్రహీతకు సన్మానం

పెద్దదోర్నాల : పెద్దదోర్నాల పంచాయితీ కార్యదర్శి మోహన్‌రావు ఉత్తమ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ఈనెల 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున, కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు ఉత్తమ అవార్డు అందుకున్నారు. అందులో భాగంగా సర్పంచి చిత్తూరి హారిక, ఎంపిడిఓ విజయ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి అమ్మిరెడ్డి రామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు జోగి వెంకట నారాయణ, బొగ్గరపు రమేష్, ఉప సర్పంచి రసూల్, పిఆర్ ఎఇ రవీంద్రారెడ్డి, ఎపిఎం పోలయ్య, ఉపాధ్యాయులు సన్నిధి కిశోర్ కుమార్, కరుణాకర్, సచివాలయ కార్యదర్శులు, వార్డు మెంబర్లు, వాలంటీర్లుపాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

యర్రగొండపాలెం : మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం చెంచు కాలనీలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ, ఐటిడిఎ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య మిత్ర జిసి.శేఖరాచారి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఒంగోలుకు చెందిన రవి తల్లి పిల్లల వైద్యశాల, శ్రీ ప్రశాంతి వైద్యశాలలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గర్భిణులు, పిల్లలకు నరములు, ఎముకలు, కీళ్ళు, జనరల్ కేసులు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



భవిష్యత్‌కు గ్యారంటీలో టిడిపి శ్రేణులు

'టిడిపితోనే భవిష్యత్‌కు గ్యారెంటీ'

మార్కాపురం : టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత తెలిపారు. స్థానిక 7వ వార్డులో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని, దౌర్జన్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, పిహెచ్.ఖాన్, మహిళా నాయకురాలు పెద్దక్క పాల్గొన్నారు.

విత్తనాల కిట్లు అందజేత

కొండపి : ప్రతి మహిళా తమ ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో కూరగాయల మొక్కలు సాగు చేసుకుంటే ఆరోగ్య కరమైన ఆకుకూరలు, కూరగాయాలు లభిస్తాయని ఎఒ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అనకర్లపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా పిఎండిఎస్ కిట్లు, కిచెన్ గార్డెన్ కిట్లను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వేముల వెంకటప్రసాద్, యూనిట్ ఇన్‌ఛార్జి వై.రంజిత్‌కుమార్, విఎఎ భరత్, రైతులు పాల్గొన్నారు.

భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్‌కు జనసేన పార్టీ నేతల వినతి

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేతలు కోరారు. నగరంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై ఆ పార్టీ ప్రతినిధి బృందం సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా జనసేన నగర అధ్యక్షుడు మలగా రమేష్ మాట్లాడుతూ నగరంలోని శ్రీ గిరి కొండమీద 400 గదుల ప్రభుత్వ భూమి, వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. మాజీ మంత్రి అండదండలతో ఒంగోలు నియోజకవర్గంలో పలువురు వైసిపి నేతలు ఈ ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. అధికారులు స్పందించకుంటే తమ పార్టీ తరుపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జనసేన నాయకులు చనపతి రాంబాబు, చిట్టెం ప్రసాద్, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్, ఆర్‌కె నాయుడు, కోట సుధీర్, ఈదుపల్లి నాగరాజు, అవినాష్ తదితరులు ఉన్నారు.



జేసికి వినతి పత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు



మాట్లాడుతున్న సిడిపిఒ

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-శింగరాయకొండ

బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో అన్ని లైన్ డిపార్టుమెంట్లు సంఘటితంగా కృషిచేయాలని ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బుంగ బావి సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒమల్లేశ్వరి, శింగరాయకొండ ఎస్ఐ టి.శ్రీరామ్, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మల్లేశ్వరి మాట్లాడుతూ శింగరాయకొండ పరిధిలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. బాలికలు ప్రలోభాలకు లోను కాకుండా తమకు అసౌకర్యం అనిపించిన పరిస్థితిని వెంటనే పెద్దలకు తెలియజేసి తమను తాము రక్షించుకోవాలన్నారు. అనంతరం మండల పరిధిలో అన్ని సచివాలయాల మహిళా పోలీసులు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. గ్రామస్థాయిలో మహిళలు,బాలికలపై జరిగే ఘటనల గురించి ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందజేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీ విజయ గణపతి స్వామి దేవస్థానం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.శాశ్వత అధ్యక్షుడిగా బివిఎల్. ప్రసాద్, అధ్యక్షుడిగా సంకా ప్రసన్నరావు, ఉపాధ్యక్షులుగా వెచ్చా హరగోపాల్, అయితా సుబ్బారావు, తంగరాల మల్లిరెడ్డి, రావిక్రింది పవన్ కుమార్, సెక్రెటరీగా రావిక్రింది లక్ష్మీ నరసింహారావు, జాయింట్ సెక్రటరీలుగా బొంతం నాగరాజు, గోనుగుంట్ల అరవింద, శ్రీనివాసా చారి, పెరుమాళ్ల శ్రీనివాసులు, కోశాధికారులుగా మొగిలి యోగి సుబ్బారావు, నాగేళ్ల సత్యనారాయణ, గోనుగుంట్ల సుబ్బ నాగేంద్ర ప్రసాద్, మరో 16 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూమిని కాపాడి...

పేదలకు పంచాలని ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడి భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం, తర్లపాడు మండలాల పరిధిల్లో ప్రభుత్వ భూములను భూస్వాములు, అధికార పార్టీ నాయకులు,పెత్తం దారులు కబ్జా చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేసుకొని దర్జాగా అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లేని నిరుపేదలు దిక్కుతోచని స్థితిలో వ్యవసాయ కూలీలుగా మారి ఇతర ప్రాంతాలకు వలస పోతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని అక్రమ ఆన్‌లైన్ రద్దు చేసి ఆభూములను నిరు పేదలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున భూమిని కేటాయించాలన్నారు. ఆక్రమంగా ఆన్‌లైన్‌కు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప కలెక్టర్ సేథు మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొగ్గు రామిరెడ్డి, షేక్ నబి రసూల్, కొమ్ము డేవిడ్, జి.వి సుబ్బారెడ్డి, షేక్ ఖాశిం, ఒర్సు అడివయ్య, బందారు రాజేష్, జానముల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి 7
మంగళవారం 22 ఆగష్టు 2023

ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల ఇక్కట్లు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆచరణలో ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మాత్రం భర్తీ చేయడంలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శీలవారిపల్లి కదిరి వెంకట నరసయ్య, లక్ష్మమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల, ప్లస్ టు కళాశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర గందరగోళంలో ఉన్నారు. విద్యా సంవత్సరం సగం పూర్తయినా ఉపాధ్యాయులు లేక పాఠ్యాంశాలు చదవలేకపోతున్నారు. ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 200 మంది



ఉపాధ్యాయుల కొరత ఉన్న శీలంవారిపల్లె జెడ్‌పి పాఠశాల

విద్యార్థులు ఉన్నారు. జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్లస్ టు కళాశాలలో ఒక ఇంగ్లీష్ పోస్టు ఖాళీగా ఉంది. విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా ఇంగ్లీషు ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదు. హైస్కూల్ విద్యార్థులకు ఇంగ్లీషు బోధించేవారు లేకపోవడంతో విద్యార్థులు వెనుకబడి పోతున్నామంటూ ఆవేదన చెందుతున్నారు. ఒక్క ఇంగ్లీష్ ఉపాధ్యాయులే కాదు గణితం, ఒక పిఎస్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయా సబ్జెక్టులలో మార్కులు తగ్గుతాయేమోనని భయంగా ఉందని ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థులు గోగు మహాలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లీషులో ఫెయిల్ అవుతామేమోనని భయంగా ఉందని పదో తరగతి విద్యార్థి ఆలా నరేంద్ర వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి తమ చిన్నారుల భవిష్యత్తు కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


గడప గడపకు కార్యక్రమంలో మంత్రి నాగార్జున

గడప గడపకు మంత్రి మేరుగ

ప్రజాశక్తి-వేమూరు

చుండూరు మండలం మోదుకూరులో చేపట్టిన గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొన్నారు. మోదుకూరు-2 సచివాలయం పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుని తక్షణ పరిష్కార సమస్యలను అధికారులతో చెప్పి పరిష్కరించారు. కార్యక్రమంలో చుండూరు ఎంపీపీ జాలాది రూబేన్, సర్పంచ్ అన్నపురెడ్డి రఘురాంరెడ్డి, ఉప సర్పంచ్ భూక్యాస్యాలి, ఎంపీటీసీలు ఆళ్ల వెంకట రమణారెడ్డి, బాల సరస్వతి, వీరారెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ సభ్యులు ఇంకొల్లు మల్లేశ్వర వర ప్రసాద్, కన్యాకుమారి దంపతుల కుమారుడు భగత్ (అమెరికా) పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఇడుపులపాడు ఆసరా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు అలవల శ్రీనివాసరెడ్డి, సోమేపల్లి రామమోహనరావు, భవనం అంజిరెడ్డి, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ దంపతుల సేవలను అభినందించారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పంగులూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన యోగ పోటీలో మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఒంగోలు గద్దలగుంటలో పింగళి దశరథ రామయ్య ఓరియంటల్ స్కూల్లో బాల, బాలికల యోగా పోటీలు ఆదివారం జరిగాయి. పోటీలలో 10-12 సంవత్సరాల విభాగంలో ఎన్ శ్రుతి, ఎం వెంకటేష్, 12-14 సంవత్సరాల విభాగంలో ఎన్ సుప్రియ, ఎన్ హాసిని విజయం సాధించారని పాఠశాల హెచ్ఎం చందలూరు గిరిజ తెలిపారు. సెప్టెంబర్ నెల 9,10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు.

రూ.3.9కోట్లతో కొత్త విద్యుత్తు లైను

ప్రజాశక్తి-పంగులూరు


శంకుస్థాన చేస్తున్న కృష్ణచైతన్య

విద్యుత్తు లేకుండా జీవనం సాగించే పరిస్థితి లేదని గ్రామాలకు కూడా 24గంటలు విద్యుత్తు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైసిపి అద్దంకి ఇన్‌ఛార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని పంగులూరు, కోటపాడు, కొండమంజులూరు, జనకవరం, కొండమూరు గ్రామాలకు విద్యుత్తు అందించేందుకు రూ.3.9కోట్లతో నిర్మించనున్న కొత్త విద్యుత్తు లైనుకు సోమవారం ఆయన పంగులూరులో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమధ్య కాలంలో ఏర్పడిన విద్యుత్ ఆటంకాలు తొలిగిపోతాయని అన్నారు. ఐదు వేల జనాభా కలిగిన గ్రామాల్లో చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు వీలుగా త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం భావించిందని డిఇ మస్తాన్‌రావు అన్నారు. కార్యక్రమంలో ఏఈ (టెక్నికల్) బాలకోటేశ్వరారావు, ఏడి సత్యనారాయణ, ఏఈ ఆంజనేయులు, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయని వెంకట సుబ్బారావు, కోటపాడు మాజీ సర్పంచ్ యర్రం గోపాలరెడ్డి, వైసిపి నాయకులు గుదిపూడి రామారావు, బి రామారావు, సాంబశివరావు, జాగర్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రేపల్లె


ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఏపీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఎలక్ట్రికల్ ఏడి ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులు మోసం చేసిందని అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు నష్టం చేసే ఒప్పందం చేశారన్నారు. ఈ ఒప్పందాన్ని స్ట్రగుల్ కమిటీగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలు కాకుండా విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకి ఉపయోగం లేని తిరోగమన ఒప్పందం చేశారని అన్నారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, నాయకులు రాజ రమేష్, ఏ అంబేద్కర్, శంకర్, సిఐటియు నాయకులు కే రమేష్, కె ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం

ప్రజాశక్తి-అద్దంకి

రైతులు విత్తన స్వయం సమృద్ధి సాధించడమే గ్రామ విత్తన పథకం లక్ష్యమని జిల్లా ఎడి విజయనిర్మల అన్నారు. మండలంలోని శంఖవరప్పాడు ఆర్‌బికె వద్ద గ్రామ విత్తన పథకంపై శిక్షణ నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఒబయ్య మాట్లాడుతూ 50 శాతం రాయితీపై బీపీటీ 5204 మూల విత్తనాలు ఇచ్చామని, ఇవి పండిన తరువాత 3సంవత్సరాలు ఇవే విత్తనాలు వాడుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త సురేఖదేవి, ఎడిఎ కె ధనరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రియాంక, ఏఈ ఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ పోస్టుకు పెరుగుతున్న పోటీ

ప్రజాశక్తి - పొదిలి



పొదిలి పోలీసు స్టేషన్ భవనం

ఎస్ఐ పోస్టుకు డిమాండ్ పెరుగుతుంది. పులువురు ఎస్ఐలు పొదిలిలో పోస్టింగ్ వేయించుకునేందుకు పోటీ పడుతున్నట్లు పోలీసు శాఖలో దుమారం రేగింది. జిల్లాకు నడిబొడ్డున ఉన్న పొదిలి పట్టణంలో ఎస్ఐ పోస్టు అంటే మంచి ఆదాయ వనరుగా ప్రచారంలో ఉంది. తాజాగా ఎస్ఐల నియామకాల్లోనూ పొదిలికి ఎవ్వరినీ నియమించకపోవడంతో పొదిలి ఎస్ఐ పోస్టుపై మరింత ఆసక్తి పెరిగింది. పట్టణంలోనూ చర్చకు దారితీసింది. రాజకీయ, అధికార సిఫారసుల కోసం పలువురు ఎస్ఐలు పోటీ పడుతున్నారు. పోటీలో ఎవరు ఎక్కువ ఖర్చుపెట్టుకుంటే వారికే పోస్టు దక్కే అవకాశం ఉందని ప్రచారం ఉంది. ఇటీవల కొందరు కుర్రాళ్ళు బైక్ రేసింగ్ పేరుతో మార్కాపురం అడ్డ రోడ్డు వద్ద గొడవ పడ్డారు. పట్టణంలో కాలేజీ రోడ్డు, ఇతర ప్రధాన కూడళ్ళలో ఆకతాయిలు, విద్యార్థులు, ద్విచక్ర వాహనాలపై త్రిబుల్, ఫోర్ రైడింగ్ చేస్తూ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తు న్నారు. అయినా పోలీసులు పట్టించుకోలేదని చర్చ జరుగుతోంది. ఎవరికైనా పోస్టింగ్ ఇవ్వాలంటే రాజకీయ సిఫార్సు తప్పనిసరి కావడంతో పొదిలి పోస్టింగు కోసం ముగ్గురు, నలుగురు పోటీ పడుతున్నట్లు సమాచారం.

మహిళలు హారతితో ఎంఎల్ఎకు స్వాగతం

ప్రజాశక్తి - పొదిలి


తిలకం దిద్ది స్వాగతిస్తున్న మహిళలు

పట్టణంలోని 3వ వార్డు వైఎస్ఆర్ నగర్, అచ్చిరెడ్డి నగర్, విరాట్ నగర్‌లో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డికి మహిళలు పూల వర్షం కురిపించారు. బొట్టుపెట్టి హారతి ఇచ్చి స్వాగతం పలికారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కొండారెడ్డి ప్రతిగడపకూ వెళ్లి అక్క, అమ్మ, అవ్వ, తాతా అంటూ వరసలతో ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ రామనారా యణరెడ్డి, మాజీ సర్పంచ్ గురువారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, స్టేట్ డైరెక్టర్ యూత్ రమణారెడ్డి, పట్టణ కన్వీనర్ నూర్జహాన్, జెసిఎస్ కన్వీనర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు. **పొదిలి :** ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి ప్రారంభించారు. పొదిలి పట్టణం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో సకల సౌకర్యాలతో నూతనంగా సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారు. నూతన భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ అన్నారు.

పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-పర్చూరు

మండలంలోని నూతలపడులో రైతులు సాగు చేసిన పత్తి పంటను జిల్లా వనరుల విభాగం డిడిఎ ఎం విజయనిర్మల, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఎం ఓవయ్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త (ఎంటమాలజిస్ట్) డాక్టర్ సురేఖ పరిశీలించారు. పత్తి పంటలో నియో నికోటినయిడ్ గ్రూపునకు చెందిన తిమోతెక్సారం, ఫ్లోనికామిడ్ మందును పిచికారీ చేయవద్దని డాక్టర్ సురేఖ సూచించారు. రైతులు వేప నూనెను ఒక ఎకరానికి 400 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. వీరి వెంట ఎఒ ఎస్ రామమోహనరెడ్డి, సిహెచ్ మధుమోహన్ ఉన్నారు.

నూతన ఎస్ఐగా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - కొనకనమిట్ల


ఎస్ఐ బ్రహ్మనాయుడు

నూతన ఎస్ఐగా బి బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో సిసిఎస్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన కె దీపిక ఎసిబి దాడుల్లో పట్టు పడటంతో ఖాళీ ఏర్పడింది. బ్రహ్మనాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కషి చేస్తానని అన్నారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మండలంలోని వ్యవసాయ, ఉద్యాన పంటలను ఇ-పంట నమోదు చేసుకోవాలని ఎఒ ప్రసన్నరంగలక్ష్మీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి, కంది, కూరగాయలు, పండ్ల తోటలు తదితర పంటలను సాగు చేసిన రైతులు తప్పని సరిగ్గా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని చిన్నారికట్ల గ్రామంలో ఇ-క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు.


అన్నదానంకు విరాళం అందజేస్తున్న దాతలు

హుండీ ఆదాయం రూ.1.62లక్షలు

ప్రజాశక్తి - సిఎస్ పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ1,62,564 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి జి రమణారెడ్డి తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్లు ద్వారా రూ 65,590, లడ్డు ప్రసాదం ద్వారా రూ 30,150, స్వామివారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకంకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ 41,708, ఆలయ మహాపాకారం నిర్మాణమునకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.10,116, ఇతర విరాళాలు రూ 15,000 వచ్చినట్లు చెప్పారు. ఇందులో శాశ్వత అన్నదానంకు కోమరోలు మండలం కృష్టంపల్లికి చెందిన గోగంటి రాజశేఖరరెడ్డి, పవిత్ర దంపతులు రూ 10,016, ఆలయ మహా ప్రాకారం నిర్మాణానికి బద్వేల్‌కు చెందిన ముత్యాల నిర్వాన్ కార్తీక్ రూ 10,116 విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

ఎఐఎం అధ్యక్షునిగా బండి

ప్రజాశక్తి - పొదిలి

అంబేద్కర్ ఇండియా మిషన్ పొదిలి మండల అధ్యక్షుడిగా బండి అశోక్ నియమితులయ్యారు. అగ్నిమాపక, ప్రకృతి విపత్తు ల విభాగం డిజిపి పివి సునీల్ కుమార్ సూచనల తో స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ యన్నం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొదిలిలో అంబేద్కర్ ఇండియా మిషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. దళితులపై దాడులు, దళిత వాడల అభివృద్ధిపై తమ మిషన్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షులు కె అనిల్ అన్నారు.

రాజ్యాంగంపై రాత పరీక్ష

ప్రజాశక్తి-రేపల్లె

రాజ్యాంగంపై అవగాహన పెంచేందుకు సెప్టెంబర్ 10న రాత పరీక్ష నిర్వహిస్తున్న ట్లు నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు తెనాలి క్రాంతి సుమన్‌బాబు సోమవారం తెలిపారు. కుల నిర్మూలన కలయిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్ష రాసేందుకు 15 ఏళ్లుపైబడిన ప్రతి ఒక్కరూ అర్హులేనని తెలిపారు. మెరిట్ వచ్చిన పది మందికి బహుమతులు ఇస్తామన్నారు. వివరాల కోసం 7032686204, 9441268501 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర సమావేశాలకు తరలివెళ్లిన ఎన్జీవోలు



సిఎం జగన్‌తో ఎన్జీవో నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర 21వ కౌన్సిల్ సమావేశాలు విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశాలను విజయవంతం చేయడానికి ప్రకాశం జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు సోమవారం తరలివెళ్లి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేశారు.

విజయవాడలో ఉత్సాహంగా ప్రారంభం

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శరత్ బాబు, కార్యదర్శి కృష్ణారెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి ప్రత్యేకంగా జిల్లా సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా అధ్యక్షులు కె.శరత్ బాబు, కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి కేశవకుమార్, ఎం వెంకటేశ్వరరావు కార్యనిర్వాహక కార్యదర్శి బి ఏడుకొండలు, ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్,ఎం, షరీఫ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు కె.కోటేశ్వరమ్మ కార్యదర్శి సిహెచ్ శిరీష , ఒంగోలు పట్టణ అధ్యక్షులు జ్యోతి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.